క్లుప్తంగా

భారత్‌కు సాటి లేరెవ్వరూ..
ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్


శివప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ప్రతినిధులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): అంతరిక్ష సాంకేతికలో భారత్ అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని గడించిందని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్ అన్నారు. ఆగస్టు 23 భారత జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ స్టార్స్ ఆధ్వర్యంలో శనివారం నారాయణ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో, సముద్ర రంగాల్లో ఇస్రో ఇప్పటికే అనేక ప్రయోగాలు చేసి మానవాళి జీవనానికి అవసరమైన అనేక విషయాలు కనుగొన్నట్టు వివరించారు. శాటిలైట్ ఆధారంగా గ్రామాల్లో టెలీ మెడిసిన్, టెలీ వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. చంద్రయాన్-3 విజయవంతమై ఏడాది పూర్తి కావడం గర్వకారణమన్నారు. ఇస్రో సాంకేతికతపై విద్యార్థులను ప్రశ్నలడిగి, సరైన సమాధానాలు చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం క్లబ్ ప్రతినిధులు షర్మిల, ఇంద్రగంటి నాగేశ్వరి, గరికిపర్తి నమశ్శివాయ, ప్రసాద్ తదితరులు శివప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించారు.

నైట్ షెల్టర్ పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న మేజిస్ట్రేట్ శ్రీదేవి

కాకినాడ లీగల్: కాకినాడ రామారావుపేటలో ఉన్న నైట్ షెల్టర్‌లో రికార్డులను కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి శనివారం పరిశీలించారు. ఈ కేంద్రాన్ని ఆశ్రయించిన వారి వివరాలతో పాటు, వసతులను తనిఖీ చేశారు.

26 నుంచి డీఎస్ఏలో జాతీయ క్రీడా వారోత్సవాలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా క్రీడా మైదానంలో డీఎస్ఏ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 26న ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, హాకీ పోటీలు, ఉట్టి ఆట, 27న అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్; బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, పవర్ లిఫ్టింగ్, యోగా, బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, చెస్, టెన్నిస్, క్యారమ్స్, టగ్‌ఆఫ్‌వార్, రైఫిల్ షూటింగ్ పోటీలు ఉంటాయన్నారు. 18-40, 41-60, 61-80 ఏళ్ల వారికి, 28న జూనియర్ కళాశాల స్థాయి విద్యార్థులకు క్రీడా పోటీలు జరుగుతాయని వివరించారు. 29న డీఎస్ఏలో జాతీయ క్రీడా దినోత్సవం జరుగుతుందని తెలిపారు. 30న డిపార్ట్‌మెంట్ క్రీడా పోటీల సెమీ ఫైనల్స్, 31న ఫైనల్స్, బహుమతులపంపిణీ ఉంటుందన్నారు.

శ్రీవారి జపయజ్ఞ పారాయణ

బోట్‌క్లబ్: వేంకటేశ్వరుని గోవింద నామాలతో ఆరాధన చేయడం ఆధ్యాత్మిక యోగమని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. శ్రీవారి 46వ జపయజ్ఞ పారాయణగా పీఠంలో శ్రీదేవి భూదేవి సమేత సహస్ర గోవింద నామ సంకీర్తన పూజా కార్యక్రమాలు శనివారం నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: మండలంలోని పీబీ దేవం గ్రామంలో ఉన్న ఆయుర్వేద అవగాహన ఆస్పత్రిలో యోగా టీచర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆస్పత్రి డాక్టర్ కె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. యోగా పీజీ కోర్సు, డిప్లొమా అర్హత ఉండాలన్నారు. పురుషులకు నెలకు 32, మహిళలకు నెలకు 20 గంటలు యోగా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆస్పత్రిలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 81433 93544 నంబరుకు సంప్రదించాలన్నారు.



నైట్ డ్యూటీ వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి

కోల్‌కతాలో వైద్యురాలిపై అఘాయిత్యం సభ్య సమాజానికి సిగ్గుచేటు. మగ వారితో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ప్రాణాలు నిలిపే వైద్యరంగంలో మహిళల సేవలు అమూల్యమైనవి. ఇటువంటి వైద్యరంగంలోని ట్రైనీ వైద్యురాలిపై కోల్‌కతాలో జరిగిన ఘటన దిగ్భ్రాంతి కలిగిస్తోంది. వైద్య రంగంలోని మహిళలతో పాటు, అన్ని రంగాల్లో మహిళలకూ రక్షణ కల్పించాలి. పీహెచ్‌లు, ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, నర్సులు, ఇతర ఇబ్బంది రక్షణకు ప్రాధాన్యమివ్వాలి. ఒక్కో సందర్భంలో మద్యం మత్తులో ఉండే పోకిరిలతో నైట్ డ్యూటీల్లో ఉండే వైద్యులు, హెడ్ నర్సులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆస్పత్రులు, పీహెచ్‌సీల వద్ద సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలి. కొన్నిచోట్ల నడవలేని స్థితిలో వాచ్‌మన్లు పనిచేస్తున్నారు. భద్రతాపరంగా వారి వల్ల ప్రయోజనం లేదు. – కాదా మాధవి, వైద్యురాలు, పండూరు పీహెచ్‌సీ, కాకినాడ రూరల్





మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలి

రేయింబవళ్లు పనిచేస్తున్న మహిళా వైద్యులకు, సిబ్బందికి తగిన భద్రత ఉండటం లేదు. మహిళలపై రోజురోజుకూ వేధింపులు ఎక్కువవుతున్నాయి. ప్రతి పీహెచ్‌సీ వద్ద పోలీసు బందోబస్తు కానీ, నిఘా కానీ ఏర్పాటు చేయాలి. ఎవరైనా మహిళలను వేధిస్తే, వారిని కఠినంగా శిక్షించాలి. పీహెచ్‌సీల్లో 50 శాతానికి పైగానే మహిళలు పనిచేస్తున్నారు. వీరికి తగిన రక్షణ కల్పించకపోతే, విధులు నిర్వర్తించడం కష్టతరంగా మారుతుంది. కోల్‌కతాలో మెడికోపై జరిగిన కిరాతక చర్యతోనైనా ప్రభుత్వం స్పందించాలి. మహిళలకు భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. – పచ్చిపాల మహాలక్ష్మి, స్టాఫ్ నర్స్, పీహెచ్‌సీ, కరప

తడిసి.. మోపెడైంది..!

- హూపర్ టిప్పర్ల మనుగడ ప్రశ్నార్థకం..!
- చెల్లింపులు లేక చెత్త సేకరణకు అవరోధం
- చెల్లింపుల్లో తీవ్ర జాప్యం
- ఇక తడి-పొడి చెత్త సేకరణ ఎలా ?

కాకినాడ: తడి-పొడి చెత్త సేకరణ ప్రశ్నార్థకం కాబోతోంది. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించే హూపర్ టిప్పర్ వాహనాలకు బ్రేక్ పడనుంది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా.. హూపర్ టిప్పర్ వాహనాల కాంట్రాక్టర్‌కు బకాయిలు చెల్లించకపోవడమే ఇందుకు కారణమంటున్నారు. ప్రభుత్వం నుంచి సొమ్ము రాకపోవడంతో, వాహనాలను నడపలేక కాంట్రాక్టర్ చేతులెత్తేసే పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే.. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండగా, ఇంటింటికీ చెత్త సేకరణ విధానంపై దృష్టి పెట్టి అప్పట్లో 108 హూపర్ టిప్పర్ వాహనాలను సమకూర్చారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన వీటిని ప్రతి డివిజన్‌కు రెండేసి చొప్పున కేటాయించారు. వాహనాల నిర్వహణ, డ్రైవర్లకు వేతనాలు, ఆయిల్ సహా అన్ని భరించేలా స్వయంభూ ట్రాన్స్‌పోర్టు అనే సంస్థకు రూ.53 లక్షలకు కాంట్రాక్టు ఇచ్చారు. ప్రతి నెలా ప్రజల నుంచి రూ.60, రూ.90 చొప్పున యూజర్ చార్జీలు సేకరించి, ఆ సొమ్మును కాంట్రాక్టర్‌కు ఇవ్వడం ద్వారా సమర్థంగా చెత్త సేకరణ జరిగేది. ఈ క్రమంలో చెత్త సేకరణ, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణలో కాకినాడ దేశంలోనే రెండో స్థానాన్ని కూడా సాధించింది.


నిలిచిపోయిన హూపర్ టిప్పర్ వాహనాలు

చేతులెత్తేసిన కూటమి సర్కార్

సమర్థవంతంగా సాగుతున్న హూపర్ టిప్పర్ వాహనాల నిర్వహణ కూటమి సర్కార్ వచ్చాక చతికిలపడింది. పాత బకాయిలు, ప్రస్తుత బకాయిలు కూడా చెల్లించకపోవడంతో, ఇప్పుడు వీటిని నిర్వహించలేక కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. ఉన్న 108 వాహనాల్లో పెట్రోలుతో నడిచే 34 వాహనాలను ఇప్పటికే పక్కన పెట్టేశారు. పెట్రోలుకు నిధులు లేని కారణంగా వీటిని ఆపేశారు. గ్యాస్‌తో నడిచే 75 వాహనాలు మాత్రం ప్రస్తుతం నడుస్తున్నాయి. సమస్య తీవ్రతతో అధికారులు తాత్కాలికంగా పెట్రోలు సమస్య తీర్చేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ, నాలుగైదు రోజుల తర్వాత మళ్లీ పునరావృతం అవుతుందని చెబుతున్నారు. అదే జరిగితే సమర్థవంతంగా సాగుతున్న తడి-పొడి చెత్త సేకరణ సందేహాస్పదమే కానుంది. కేవలం పుష్‌క్యాట్‌ల ద్వారా మాత్రమే చెత్తను తరలించే పరిస్థితి ఏర్పడుతోంది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోకపోవడంతో, రానున్న రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.


హూపర్ టిప్పర్ వాహనం లేకపోవడంతో పుష్ క్యాట్‌తో చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

ప్రభుత్వమే చెల్లించాలి



హూపర్ టిప్పర్ వాహన సేవలు కొనసాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్టర్‌తో సంబంధం లేకుండా డ్రైవర్ల వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులపై ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలి. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలి. ఎంతో కాలంగా సమర్థవంతంగా జరుగుతున్న ఈ నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూడాలి.
– పలివెల వీరబాబు, గౌరవాధ్యక్షుడు, క్లాప్ వాహన డ్రైవర్ల సంఘం

ఇబ్బందులు లేకుండా చర్యలు



ఎటువంటి ఇబ్బందులు లేకుండా హూపర్ టిప్పర్ వాహనాలు కొనసాగేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే సమస్య ఏర్పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాహనాలు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటాం.
– డాక్టర్ పృథ్వీచరణ్, ఎంహెచ్ఓ, కాకినాడ

గణపతి నవరాత్రులకు పందిరి రాట ముహూర్తం


గణపతి నవరాత్రులకు వేస్తున్న పందిరి రాట

కాకినాడ సిటీ: నగర బంగారం, వెండి అండ్ డైమండ్స్ వర్తక సంఘం ఆధ్వర్యంలో 85వ గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కన్నా ముందు నుంచి పెద్దలు పటాల చిట్టియ్య సెంటర్లో చాలా ఘనంగా నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఏడాది పులవర్తి సీతారామమూర్తి గణపతి నవరాత్రుల కమిటీ చైర్మన్‌గా 85వ సంవత్సరం కూడా గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు సహకరిస్తున్న వర్తకులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతిరోజూ స్వామికి ప్రత్యేకమైన అలంకరణలు ఉంటాయన్నారు. భక్తులందరికీ స్వామి దర్శనం చేసుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు. ఉత్సవాలకు కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు, ఎంపీని ఆహ్వానించామని తెలిపారు.

తీరు మార్చుకోకపోతే ఉపేక్షించం

- డ్వామా పీడీ వెంకటలక్ష్మి ఆగ్రహం
- ఉపాధి పనుల నిర్వహణపై బహిరంగ సమీక్ష

కరప: ఏళ్ల తరబడి 17 విడతలుగా సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నా, ఉపాధి పనుల నిర్వహణలో సిబ్బంది, అధికారుల తీరు మారడం లేదని, చేసిన తప్పులే పునరావృతం చేస్తున్నారని డ్వామా పీడీ వెంకటలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై తీరు మార్చుకోకపోతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో జరిగిన పనులపై స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ప్రజావేదిక నిర్వహించి, బహిరంగ సమీక్ష జరిపారు. గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు (17వ విడత) వరకు జరిగిన ఉపాధి పనులపై గ్రామాల వారీగా సామాజిక తనిఖీ నిర్వహించారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఏపీడీ పి.వసంతమాధవి, డీఆర్‌డీఏ డీపీఎం(పెన్షన్స్) టి.అశోక్‌భరత్, విజిలెన్స్ అధికారులు రవిశంకర్, హెచ్ఆర్ మేనేజర్ గుత్తుల రాజేష్ తదితరులు బహిరంగ సమీక్ష జరిపారు. ఉపాధి పథకం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.31 వేలు అపరాధ రుసుం విధించి, రూ.43,381 రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. పీఆర్ పనులపై రూ 1,500 రికవరీ చేయాలన్నారు. ఎంబుక్‌లో రికార్డు చేయకుండా, బిల్లులు చెల్లించడం, పనులపై పర్యవేక్షణ లేకపోవడం, పనిచేసిన ప్రాంతంలో నేమ్‌బోర్డులు ఉంచకపోవడం, నాటించిన మొక్కలు పూర్తి స్థాయిలో లేకపోవడం, కొలతల ప్రకారం రోడ్లు వేయనందుకు, తీర్మానాలు లేకపోయినా, డిమాండ్ లేకుండా పనులు చేస్తున్నా పట్టించుకోకపోవడం, పనికి ముందు, చేసిన, ఆ తర్వాత ఫొటోలు తీయకపోవడం, జాబ్‌కార్డులు మంజూరు చేయనందుకు, కాలువల కొలతలు సక్రమంగా లేనందుకు తదితర కారణాలతో ఉపాధి పథకం సిబ్బంది, అధికారుల పనితీరును సోషల్ ఆడిట్ అధికారులు తప్పుపట్టారు.


కరపలో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి, సోషల్ ఆడిట్ అధికారులు

23 గ్రామాల నివేదిక

ముందుగా ఎస్ఆర్పీ పి.సింహాద్రి మండల పరిధిలో 23 గ్రామాల్లో జరిగిన సామాజిక తనిఖీపై నివేదిక ఇచ్చారు. ఆయా గ్రామాల పరిధిలో ఉపాధి పథకం, పంచాయతీరాజ్, సర్వశిక్షా అభియాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా రూ.10,38,47,908 విలువ చేసే 1,320 పనులు చేశారు. 11,748 మందికి వివిధ రకాల పింఛన్ల పంపిణీ జరిగింది. ఎస్ఆర్పీ సింహాద్రి పర్యవేక్షణలో డీఆర్పీలు కె.హరి, బి.అశోక్‌కుమార్, ఎం.అప్పలరాజు, వై.శ్యామ్ గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంపీడీఓ కె.అప్పారావు, ఏపీఓ జీవీ రమణ కుమార్, ఏఈఈలు వీవీఎస్ వర్ధన్, జి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి


డీఎఫ్ఓ భరణిని సత్కరిస్తున్న ప్రముఖులు

- జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూకేలో వ్యక్తిత్వ వికాసం-అభిరుచులు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవిత కాలం విద్యార్థి అని, జ్ఞాన నేత్రంతో ప్రపంచాన్ని చూడాలన్నారు. అందం అనేది మన గమ్యంలో ఉండదని, అది మన జీవన ప్రయాణంలో ఉంటుందన్నారు. ఉన్నత లక్ష్యాలను సాకారం చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. కాకినాడ జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి మాట్లాడుతూ కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి జాతీయ పతాకాన్ని ఎగురవేశానని, ఆ విజయం మహిళలకు అంకితమిచ్చానన్నారు. అలాగే యూరప్‌లో అతి పెద్దదైన రష్యాలోని ఎల్బ్రస్ పర్వతాన్ని ఎంత ఒత్తిడి ఎదురైనా చిరునవ్వుతో అధిరోహించానన్నారు. కళాశాల స్థాయిలో విద్యార్థులకు ఎన్నో అవకాశాలు ఉంటాయని, వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రంపచోడవరం డీఎఫ్ఓ నరేంద్రన్, మాజీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, డైరెక్టర్ రత్నకుమారి, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ సుగుణారెడ్డి, ధరిత్రి రక్షిత సమితి అధ్యక్షురాలు సీమకుర్తి సురేఖ, మురళీ, డాక్టర్ బాదం బాలకృష్ణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన ఉద్యోగ నేతలు

కాకినాడ సిటీ: జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాహుల్ మీనాను వివిధ సంఘాల నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కాకినాడ జిల్లా శాఖ అధ్యక్షుడు పితాని త్రినాథరావు ఆధ్వర్యంలో రెవెన్యూ కాన్ఫడరేషన్ సభ్యులు, ఏపీఆర్ఎస్ఏ, వీఆర్వోలు, వీఆర్ఏలు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆల్ క్లాస్ ఫోర్ ఉద్యోగుల సంఘ సభ్యులు ఆయనను కలుసుకున్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో జిల్లా యంత్రాంగానికి రెవెన్యూ ఉద్యోగుల పక్షాన సంపూర్ణంగా సహకరిస్తామని తెలిపారు. జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ ఉద్యోగులకు తమ పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఆయా సంఘాల ప్రతినిధులు రామమోహన్, నాయుడు, దుర్గాప్రసాద్, గోవిందరాజు, రవి, యమున, శివ, విజయ్, ప్రసాద్, రమేష్‌బాబు, దీపిక, రమ్య, చిన్న, సూరిబాబు, తెల్ల అబ్బులు, శ్రీను, సవరపు చినపాపారావు, ఖండవిల్లి చంద్రశేఖర్, ముక్కే రామకృష్ణ దుర్గాప్రసాద్, తదితరులు ఉన్నారు.


జేసీ రాహుల్ మీనాను కలిసిన ప్రతినిధులు

పోలీసుల చొరవతో రహదారి మెరుగు


భారీ గోతులను పూడుస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కాకినాడ క్రైం: నగరంలోని స్థానిక చంద్రిక థియేటర్ ప్రాంతంలో ధ్వంసమైన రహదారిని మెరుగుపరచడంలో పోలీసులు సామాజిక బాధ్యతను కనబరిచారు. రహదారిపై భారీగా ఏర్పడిన గోతులను పూడ్చేందుకు ట్రాఫిక్-1 సీఐ నూనె రమేష్, ఆయన బృందం సొంత ఖర్చులతో మెటీరియల్ సమకూర్చి, భారీ గోతులను పూడ్చారు. ఈ సందర్భంగా పోలీసులను స్థానికులు అభినందించారు.

శృంగార వల్లభుడి ఆలయానికి భక్తుల రద్దీ

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం శనివారం కావడంతో ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో స్వామి వారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పూలమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.2,04,008 ఆదాయం సమకూరినట్టు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, భక్తులకు ప్రసాద వితరణ అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఈఓ తెలిపారు. సుమారు మూడు వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.


స్వామివారి దర్శనానికి క్యూలో నిలబడిన భక్తులు

పేదలకు అన్నదానం

బోట్‌క్లబ్: డొక్కా సీతమ్మ అన్నపూర్ణాదేవి సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక టూ టౌన్ పోలీసు స్టేషన్ సమీపంలోని హరీష్ స్పోర్ట్స్ వద్ద సుమారు 350 మందికి అన్నదానం నిర్వహించారు. సంఘ చైర్మన్ తలాటం హరీష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి శనివారం సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సానా సతీష్‌బాబు ఫౌండేషన్ సభ్యులు సత్తిబాబు, ముమ్మిడి వెంకటేష్ సౌజన్యంతో అన్నదానం నిర్వహించినట్టు చెప్పారు.

సాగర తీరాన నృత్య తరంగాలు

- ఘనంగా ప్రారంభమైన నృత్య నీరాజనం

బోట్‌క్లబ్: కళకు భాష లేదు. కళాకారులకు సరిహద్దుల్లేవు అన్నట్టుగా..రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులకు కాకినాడ సాగర నగరం ఆతిథ్యమిచ్చింది. రెండు రోజుల పాటు, వెయ్యి మంది కళాకారులు నిరాటంకంగా చేసే నృత్య ప్రదర్శనలకు వేదికైంది. కళారంగానికి విశేష సేవలందించి, ప్రపంచ పుటల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పదిలం చేసుకున్న కళాకారుడు ఆనెం రామచంద్రన్ స్మృత్యర్థం.. శాస్త్రీయ నృత్య కళాకారుల సంక్షేమ సమాఖ్య(కాకినాడ) వారు ఈ మహోత్తర ఘట్టాన్ని భుజాన వేసుకున్నారు. రెండు రోజుల పాటు స్థానిక సూర్య కళా మందిరంలో జరిగే వెయ్యి మంది కళాకారుల నృత్య నీరాజనానికి శనివారం ఘనంగా ఆంకురార్పణ జరిగింది.
సమాఖ్య ప్రతినిధులు టీవీఎస్. వరప్రసాద్, ఆనెం ప్రసాద్, లోకేషశర్మతో పాటు, అతిథులు పార్వతీ రామచంద్రన్, కుమార సత్యనారాయణ జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75 గంటల నిరివ్రామ నృత్య ప్రదర్శనతో ప్రపంచ రికార్డు సాధించిన ఆనెం లక్ష్మణరావును స్మరిస్తూ, ఏటా నృత్య నీరాజనం నిర్వహిస్తున్నామన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి తరానికి శాస్త్రీయ నృత్యంపై మక్కువ పెంచడంతో పాటు, వారి ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు వేదికగా నృత్య నీరాజనం ఉందన్నారు. రెండు రోజుల పాటు నిర్విరామంగా జరిగే నృత్య నీరాజనంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు, వివిధ రాష్ట్రాలకు చెందిన 53 నృత్యసంస్థలకు చెందిన వెయ్యి మందికి పైగా విద్యార్థులు, కళాకారులతో పాటు, నాట్య గురువులు పాల్గొంటారన్నారు. అనంతరం నాట్య కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆనెం లక్ష్మణరావు స్మారక అవార్డును ఏలూరుకు చెందిన పార్వతీ రామచంద్రన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యానికి ఎంతో సేవలందించిన ఆనెం లక్ష్మణరావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. నేటి తరం శాస్త్రీయ నృత్యంలో రాణించాలన్నారు. ఈ సందర్భంగా నాట్యాచార్యులకు గురుసత్కారంతో పాటు, నాట్యం చేసిన చిన్నారులకు జ్ఞాపికలు అందజేశారు.



నాట్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారి కళాకారులు


ఆనెం లక్ష్మణరావు స్మారక అవార్డును అందుకున్న ఏలూరుకు చెందిన పార్వతీ రామచంద్రన్

లీజుకు ఆర్టీసీ స్థలాలు

- 28న అవగాహన సదస్సు

కాకినాడ: డిపో పరిధిలోని కాకినాడ, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురంల్లోని ఖాళీ స్థలాలను లీజు ప్రాతిపదికన ఇవ్వనున్నట్టు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ చెప్పారు. డిపో ఆవరణలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 15 ఏళ్ల కాలానికి లీజుకు ఇచ్చేలా ఇప్పటికే టెండర్లు కూడా పిలిచామన్నారు. కాకినాడ పాత బస్టాండ్ వద్ద 4,017 చదరపు గజాలు, పెద్దాపురం మున్సిపల్ మార్కెట్ వద్ద 9,844 చదరపు గజాలు, పెద్దాపురం మున్సిపల్ మార్కెట్ వద్ద 5,654 చదరపు గజాలు, పెద్దాపురం కొత్త బస్టాండ్ వద్ద 206 చదరపు గజాలు లీజుకు ఇస్తామన్నారు. అలాగే పిఠాపురం బస్ స్టేషన్ వద్ద 1,824 చదరపు గజాలు, 1,516 చదరపు గజాలు ఇస్తామన్నారు. ఈ నెల 19న ప్రారంభమైన టెండర్ షెడ్యూల్ వచ్చే నెల 12వ తేదీ వరకు అవకాశం ఉందని చెప్పారు. ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ నెల 28వ తేదీ ఉదయం 11.30కు అవగాహన సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.


ఎంయూవీ మనోహర్